కొలువుదీరిన కనకదుర్గమ్మ



బుచ్చిరాజుపాలెంలో పూజ చేస్తున్న అర్చకులు



కలశ పూజలో పాల్గొన్న భక్తులు

- కోలాహలంగా దసరా ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాల్లో పూజలు అందుకున్న అమ్మవారు
- కాలనీల్లో వెలసిన ప్రత్యేక మండపాలు

విశాఖ విద్య: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీదుర్గాలమ్మ- శ్రీ బంగారమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన పూజ శాస్త్రోక్తంగా అర్చకులు జరిపించారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బుజ్జి, కార్యదర్శి జగన్, కుమార్, గోపి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తొమ్మిది రోజులు పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కాలనీల్లో మండపాల ఏర్పాటు

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో దసరా ఉత్సవాల జోష్ కనిపిస్తోంది. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని అంబేడ్కర్ నగర్, కరాస తదితర కాలనీల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి, అమ్మవారి విగ్రహాలను నెలకొల్పారు. యువకులు, మహిళలు అమ్మవారి మాలధరించి పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక బందోబస్తు

దసరా ఉత్సవాల నేపథ్యంలో ఎన్‌ఏడీ కూడలిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చేటు చేసుకోకుండా పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. కాలనీల్లో మండపాలు ఏర్పాటు చేసిన చోట, నిర్వాహకులు ముందస్తు హెచ్చరికలు చేశారు.

గోపాలపట్నం: దుర్గా దేవి శరన్నవరాత్రులు పలు ప్రాంతాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తపాలెం దుర్గా దేవి ఆలయంలో ఉదయం నుంచి అర్చనలు అభిషేకాలు చేశారు. సామూహిక కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తొలి రోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శన మిచ్చారు. కొత్తపాలెం ప్రధాన రహదారిలో పలు చోట్ల దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. నాగేంద్ర కాలనీలో ఉదయం నుంచి భవానీలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్‌లోని దుర్గమాంబ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీవీఎల్.సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు కలశ ప్రతిష్ఠ చేశారు. స్వర్ణ కవచ దుర్గాదేవికి భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు.

సామూహిక కుంకుమార్చన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం కొండపై గల దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రులు సందర్భంగా ఆలయ ధర్మకర్త శివరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిపారు. కార్యక్రమంలో పిలకవానిపాలెం, గొందేశివానిపాలెం,శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా వారు దుర్గదేవి కీర్తనలు ఆలపించారు.

పలుచోట్ల పూజలు..

మల్కాపురం : అగ్నికుల క్షత్రీయ సంఘం, యాదవ వీధి అల్లరి యూత్ ఆధ్వర్యంలో దసరా పూజలు ప్రారంభం అయ్యాయి. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం దుర్గాదేవి అష్టోతర నామాలు, లలితానామాల పారాయణ చేశారు. అలాగే జనతా కాలనీ వద్ద జైదుర్గా ఆలయంలో, గాజువాక ఆర్టీసీ డిపో దుర్గాదేవి ఆలయం వద్ద, 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వార్డు పరిధి ఏకేసీకాలనీలో రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవిని నెలకొల్పారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెర్రిపోతుల మహేష్ పాల్గొన్నారు.

- జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో క్రాంతి క్రేజీబాయ్స్ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు.
- షిప్‌యార్డ్ సమీపంలోని సాగరి కనకదుర్గాదేవిని బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో పూజలు



పూజలందుకుంటున్న దుర్గాదేవి



అమ్మవారికి హారతులు ఇస్తున్న అర్చకుడు



కొత్తపాలెంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



నాగేంద్ర కాలనీలో..

క్లుప్తంగా

బెహరాను కలిసిన రోడ్డు విస్తరణ బాధితులు

గోపాలపట్నం: స్థానిక ఇందిరానగర్ దరి లక్ష్మీనగర్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఆదివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును కలిశారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న తమను అర్థాంతరంగా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలిస్తున్నారని ఆయన ముందు వాపోయారు. తామంతా అభివృద్ధికి సహకరిస్తామని.. తమ జీవితాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన నగరాభివృద్ధికి సహకరించాలని ఇక్కడి వారి పరిస్థితి తనకు తెలుసునన్నారు. అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొమ్మనాపల్లి త్రినాథరావు, కమిడి రామకృష్ణ, మార్కండేయ రాజశేఖర్, కోనేటి శ్రీను, బండి దుర్గేష్, ఊటపల్లి గోవిందు, టి రమేష్, జయశంకర్ తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గోపాలపట్నం: గోపాలపట్నం కళింగ వైశ్య సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం కొత్తపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గెంబలి మధుసూదనరావు, కార్యదర్శిగా తూముల దామోదరరావు, కోశాధికారిగా గుడ్ల మిన్నారావు, ఉపాధ్యక్షులుగా తంగుడు గణేష్, శిల్లా రాధ, గౌరం అధ్యక్షుడిగా డాక్టర్ కోరాడ సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా బిళ్ల శాంతిజగదీష్, ముచ్చేటి కనకరాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

తేజశ్విన్‌కు అభినందన



తేజశ్విన్‌ను అభినందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన తేజశ్విన్‌ను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం సాధించిన మెడల్స్‌తో బెహరా భాస్కరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేజశ్విన్‌కు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని విశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జగదీష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'నేవీ సివిలియన్ ఆఫీసర్స్' నూతన కార్యవర్గం

సీతంపేట: ఇండియన్ నేవీ సివిలియన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ డివిజన్ సర్వసభ్య సమావేశం ఆదివారం రామాటాకీస్ రోడ్డులోని వేదిక ఫంక్షన్ హాల్లో జరిగింది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టి.ఎస్.రాయ్, భవేశ్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ కె.సుజిత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి అసోసియేషన్ పనితీరు, ఆర్థిక నివేదికలను సభకు వివరించారు. 2023–25 కాలానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాస్, కోశాధికారిగా బి.వి.నరసింహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.రమేష్‌కుమార్, బి.సర్దార్, కె.వి.ఎస్.ఎన్.రాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ సి.ప్రవీణ్‌కుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని వెనుక నుంచి స్కూటీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. వివరాలిలా.. ఎన్‌ఏడీ దరి పీఎఫ్ ఆఫీస్ ప్రాంతంలో నివసిస్తున్న కె.కృష్ణ అక్కయ్యపాలెంలోని ఓ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బైక్‌పై ఎన్‌ఏడీ నుంచి అక్కయ్యపాలెం వెళ్తున్న క్రమంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోకి వచ్చేసరికి అతడి బైకులోని పేపర్లు కింద పడిపోయాయి. బైకు పక్కకు నిలిపి పేపర్లను తీసుకుని తిరిగి వస్తుండగా.. అటుగాస్కూటీపై వచ్చిన మహిళ ఢీకొనడంతో కాలికి గాయమైంది. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై విస్తృత ప్రచారం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 91, 92 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం ఆయన నివాసం వద్ద నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేశారని చెప్పారు. ఇది ప్రజలకు ఎంతో మేలు చేసే కార్యక్రమమన్నారు. సమావేశంలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఊటపల్లి గోవిందు, దేరెడ్ల సత్యనారాయణ, పైడిరాజురెడ్డి, డానియల్, కంపర రామకృష్ణ, రాజశేఖర్, త్రినాథ్, కిమిడి రామకృష్ణ, బురెడ్డి గోపి, నాగూర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బ తిన్న ఆటో

మల్కాపురం : రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఓ ఆటోలో ఉన్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ నుండి సింధియా వైపు ఆదివారం ఉదయం ఓ ఆటో వెళ్తోంది. సరిగ్గా అదే సమయంలో డాక్‌యార్డ్ సమీపంలోని సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెన (డాక్‌యార్డ్ బ్రిడ్జి) వద్దకు గంగవరం నుండి నగరంలో గల ఫిషింగ్ హార్బర్‌కు మరో ఆటో వస్తూ మొదటి ఆటోను ఢీకొట్టింది. దీంతో సింధియా వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ దిగువకు పడిపోయాడు. అదే ఆటోలో ఉన్న మహిళ ఎడమ కాలికి తీవ్ర గాయం అయింది. దిగువకు పడిన డ్రైవర్ బయటపడ్డాడు. ఫిషింగ్ హార్బర్ వైపు వెళ్తున్న ఆటో స్వల్పంగా దెబ్బ తినగా, అందులో ఉన్న డ్రైవర్‌కు గాయాలైనట్టు తెలిసింది. అయితే గాయపడిన మహిళ వివరాలు గానీ, ఆటో డ్రైవర్ల వివరాలు గానీ తెలియలేదు. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు తెలపగలమని పోలీసులు తెలియజేశారు.

మూడు వాహనాలు దగ్ధం



దగ్ధమవుతున్న కారు, బొలెరో వాహనాలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో శనివారం అర్ధరాత్రి పార్క్‌చేసి ఉన్న మూడు వాహనాలకు నిప్పంటుకుంది. ఈ సంఘటనపై బాధితుడు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. నీలాచలం బగాది అనే వ్యక్తి తాటిచెట్లపాలెం రామాలయం వీధిలో 20 ఏళ్లుగా నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే తన ఏపీ39 యూఎస్ 6983 నంబర్ గల కారును శనివారం రాత్రి రామాలయం వెనుక భాగంలో పార్క్ చేశాడు. సుమారు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పక్కనే ఉన్న చెత్త కుప్పకు నిప్పంటుకుని అక్కడే ఉన్న రెండు బొలెరో వాహనాలతో పాటు అతడి కారుకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. కారు ఎడమ భాగం కాలిపోయి దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటావార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మల్కాపురం: క్రీడాకారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నిరావు అన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కులో ఆదివారం వాకర్స్‌తో పాటు క్రీడాకారులకు రాగిజావ, మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా క్రీడాకారులకు,వాకర్స్‌కు వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



ఢీ కొట్టిన కారు ముందు భాగం నుజ్జయిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమా దంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. ఈ కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మా మంచి మాస్టారు



ప్లకార్డుతో భూషణం మాస్టారు



హెల్మెట్ ధరించాలని కానిస్టేబుల్ రమణతో కలిసి వాహన చోదకుడికి హితబోధ చేస్తున్న మాస్టారు

- సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ప్రజలకు స్వచ్ఛందంగా అవగాహన
- రోడ్లపై గంటల పాటు ప్లకార్డు పట్టుకుని దిశా నిర్దేశం

విశాఖ విద్య : గురువు దైవంతో సమానమంటారు. అవును.. ఆ మాస్టారును చూస్తే అది నిజమేననిపిస్తుంది. వీకెండ్ వస్తే ఎంచక్కా బీచ్‌కు వెళ్లి ఎంజాయ్ చేద్దామని అంతా అనుకుంటారు. కానీ భూషణం మాస్టారు మాత్రం సెలవు దొరికితే ప్లకార్డు పట్టుకుని రోడ్డెక్కేస్తారు. రెండు మూడు గంటల పాటు రోడ్డుపైనే నిలబడి చేతిలో ఉన్న ప్లకార్డు చూపిస్తుంటారు. విశాఖలోని ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ కింద ఆదివారం ప్లకార్డుతో కనిపించిన ఇంటూరి భూషణం మాస్టారును పలకరిస్తే ఇలా చెప్పుకొచ్చారు.

పర్యావరణాన్ని కాపాడాల్సిందే..

నగరంలోని మధురానగర్ జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నానని, ఎన్‌ఏడీ సమీపంలోని ఏపీఎస్‌ఈబీ కాలనీలో నివసిస్తున్నట్లు మాస్టారు తెలిపారు. సమాజ హితం కోసం ఏదైనా చేయాలని చిన్నప్పటి నుంచీ తన కోరిక అన్నారు. అందుకే బడిలో పిల్లల బాగు కోసమని పాఠాలు చెబుతూనే, సామాజిక సమస్యలపై చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సొంత డబ్బులతోనే మొక్కలు కొని, పిల్లలతో పాఠశాలల్లో నాటిస్తానని, ఓ స్వచ్ఛంద సంస్థ 'వృక్ష మిత్ర' అవార్డుతో సత్కరించిందని తెలిపారు. చాలా మంది అధికారులు ప్రశంసించారని, ఎవరో గుర్తించాలని కాకుండా పర్యావరణ పరిరక్షణతో ప్రజలంతా హాయిగా ఉంటారని ఇలా చేస్తున్నట్లు మాస్టారు వివరించారు.

స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్..

సెలవు దొరికితే మాస్టారు నగరంలోని రద్దీ ఎక్కువగా ఉండే చోటుకు వెళతారు. 'వేగం వద్దు ప్రాణం ముద్దు' అదే విధంగా 'హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ' అనే నినాదాలతో రాసిన ప్లకార్డులు అందరికీ కనిపించేలా రెండు మూడు గంటల పాటు నిలబడతారు. ఒక వైపు తెలుగు, మరో వైపు ఇంగ్లీషులో రాసిన ఆ నినాదాలను వాహనాలపై రాకపోకలు సాగించే వారికి చూపిస్తారు. అక్కడ ట్రాఫిక్ పోలీసులు ఉన్నట్లెతే, వారి సహకారంతో హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారి వాహనాలను ఆపించి, హెల్మెట్ ధారణతో కలిగే మేలు గురించి అవగాహన కల్పిస్తారు.

హేళన చేసినా..

నీట్‌గా టక్ చేసుకుని, రహదారిపై నిలబడి 'స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్' అనే ప్లకార్డుతో వచ్చే పోయే వారందరికీ చూపిస్తుంటే హేళన చేసేవారు కూడా ఉన్నారని భూషణం మాస్టారు అంటారు. మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవటం వల్ల జరిగే ప్రమాదాల్లో యువత ఎక్కువగా చనిపోతున్నారని, తన చర్యల వల్ల ఏ ఒక్కరిలో మార్పు వచ్చినా సంతోషమే అంటున్నారు. యువత దేశ సంపద అని, వారు పది కాలాల పాటు బ్రతికి ఉంటేనే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సమాజ హితం కోరుతూ పని చేస్తున్న మాస్టారు సేవా నిరతి అపురూపమని చెప్పక తప్పదు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం



నాడు ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ రోడ్డు దుస్థితి



నేడు మెరిసిపోతున్న ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ రోడ్డు

ఆనంద్‌కుమార్ చొరవతో అద్దంలా మెరిసి పోతున్న ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీ రోడ్డు

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ సేవా మార్గంలో ప్రయాణమంటే అందరికీ గుబులే. పిక్క తేలి గుంతలు పడిన ఆ రహదారిపై వెళ్తుంటే ఒళ్లు హూనమైపోయేది. అలాంటిది నేడు ఆ రోడ్డు వజ్రంలా మారిపోయింది. ఈ దారిలో రాత్రివేళల్లో వెళ్తుంటే విదేశాల్లో ఉన్నామా అన్న అనుభూతి కలుగుతోందని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన ఈ రోడ్డు వేసిన కొన్నాళ్లకే గుంతలు పడి పిక్క తేలింది. దాంతో ఈ మార్గాన ప్రయాణించే వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. గత నెల ఈ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ పుల్రై పూర్ణశ్రీ యాదవ్‌తో కలిసి పర్యటించిన సందర్భంగా ఈ సేవా మార్గం దుస్థితిని గమనించారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి కొత్త బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో సుమారు రూ. 18 లక్షలతో బీటీ రోడ్డు వెయ్యడంతో పాటు రేడియం స్టిక్కర్ క్లాంప్స్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

విశాఖ మరింత అభివృద్ధి

మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మంత్రి ఆదిమూలపు సురేష్‌తో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం : విశాఖ నగరం సర్వాంగ సుందరంగా మారబోతోందని మున్సిపాల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. అధికార పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో మంత్రిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ నాయకులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో విశాఖ మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా బీచ్ శాండ్ క్లీనింగ్ కోసం రూ.15 కోట్లతో ప్రాజెక్టును చేపట్టబోతున్నామన్నారు. విశాఖ తీరంలో ఉన్న బీచ్‌లు శుభ్రం చేసే పని చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టును సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో భవిష్యత్తు అంధకారం



976వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్ 1గా నిలిచిందని, అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరిస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 976వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరంలో సంస్థలోని పలు విభాగాల కార్మికులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ఇప్పటికే పన్నుల రూపంలో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలను అందించిందని, ఎంతో మందికి ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.